# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనికులు ప్రదర్శించిన పరాక్రమం భారతీయులకు గర్వకారణంగా నిలిచిందని మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **అటవీ శాఖ అధికారుల కృషి కారణంగా దేశంలో సింహాల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో పెరిగిందని ప్రధాన మంత్రి తెలిపారు.**
3. **విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటానని నరేంద్ర మోదీ వెల్లడించారు. యోగాంధ్ర పేరుతో ఈ ఉత్సవం నిర్వహించడాన్ని ఆయన అభినందించారు.**
4. **ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం ఢిల్లీలో కొనసాగుతోంది.**
5. **పురపాలక శాఖ అనుమతులను సులభతరం చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు.**

==========================

పహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతి చర్యగా ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనికులు ప్రదర్శించిన పరాక్రమం భారతీయులందరినీ తలెత్తుకునేలా చేసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఒక్కటయ్యారని తెలిపారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యే మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 122వ సంచికలో తన మనసులోని భావాలను ఈ రోజు ఆయన ప్రజలతో పంచుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి ఆపరేషన్ సిందూర్ కొత్త ఉత్సాహాన్ని, నమ్మకాన్ని ఇచ్చిందని నరేంద్ర మోదీ వివరించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా సాధించిన విజయం.. ప్రజల్లో దేశం పట్ల భక్తి భావం నింపిందని, దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు త్రివర్ణ పతాకాలు చేత బూని సైనికులకు సంఘీభావం తెలియజేయడంపై ప్రధాన మంత్రి ఆనందం వ్యక్తం చేస్తూ..

..వాయిస్.. 33 సెకన్లు

------------------------

అటవీ శాఖ అధికారుల కృషి కారణంగా దేశంలో సింహాల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో పెరిగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలోని గిర్ అడవులలో కేవలం గత ఐదేళ్లలోనే సింహాల

సంఖ్య 674 నుండి 891కి పెరిగిందని చెప్పారు. సమాజంలో యాజమాన్య భావం బలంగా ఉన్నపుడు ఎటువంటి అద్భుతమైన ఫలితాలు అయినా సాధించవచ్చని చెప్పడానికి సింహాల సంఖ్య పెరగడం గొప్ప ఉదాహరణ అని ప్రధాన మంత్రి వివరిస్తూ..

...వాయిస్.. 30 సెకన్లు

---------------------------

వచ్చే జూన్ 21 వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ప్రజలు సంసిద్ధులవుతున్నారని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలిపారు. తనకు విశాఖపట్నంలో జరిగే యోగా దినోత్సవంలో పాల్గొనడానికి అవకాశం లభించిందని, ఈసారి కూడా యువత.. దేశ వారసత్వంతో ముడిపడే ప్రదేశాల్లో యోగాసనాలు వేయబోతున్నారని తెలిసి ఆనందం కలుగుతోందని అన్నారు. ఇప్పటికీ యోగా చెయ్యని వారు.. ఈ ఆరోగ్య అభ్యాసాలను అనుసరించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర ఉత్సవాన్ని నిర్వహించడాన్ని ప్రధానమంత్రి అభినందించారు. యావత్ ఆంధ్రప్రదేశ్‌లో యోగా సంస్కృతిని అభివృద్ధి పరచడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశమని నరేంద్ర మోదీ పేర్కొంటూ..

...వాయిస్.. 32 సెకన్లు

---------------------------

స్వచ్ఛ సంకల్పం కొండ లాంటి సవాళ్లను కూడా అధిగమించగలదని ప్రధానమంత్రి వెల్లడించారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్..ఐటీబీపీ సభ్యులు మౌంట్ మకాలూ లాంటి ప్రపంచంలోకెల్లా కష్టతరమైన పర్వతాన్ని అధిరోహించడానికి వెళ్లారని.. వారు కేవలం పర్వతారోహణకే పరిమితం కాకుండా తమ లక్ష్యంలో పరిశుభ్రత అనే మరో మిషన్‌ను కూడా చేపట్టారని నరేంద్రమోదీ వివరించారు. పర్వత ప్రాంతంలో 150 కిలోల కంటే ఎక్కువ నాన్ బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను తొలగించారని.. సంకల్పం ఉంటే మార్గం దానంతట అదే ఏర్పడుతుందని ఐటీబీపీ సభ్యులు నిరూపించారని ప్రధానమంత్రి కొనియాడారు.

---------------------------

ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం ఢిల్లీలో కొనసాగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌కి సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులకు కేంద్ర మంత్రులు వివరించారు. కాగా.. ఈ సమావేశంలో రెండు తీర్మానాలు చేయనున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభినందిస్తూ ఒక తీర్మానం.. దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టడంపై మరో తీర్మానం చేయనున్నారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా, భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనం తెలుపుతోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా 1965 భారత్-పాక్ యుద్ధంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి వీర మరణం పొందిన

లెఫ్టినెంట్ కల్నల్ అర్దేశిర్ బుర్జోర్జీ తారాపోర్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

..వాయిస్...30 సెకన్లు

---------------------------

పురపాలక శాఖ అనుమతులను సులభతరం చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిన్న సాయంత్రం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో పురపాలక శాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని చెప్పారు. లే అవుట్లు, భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా చూస్తామని పేర్కొన్నారు. అవసరమైన అన్ని ధ్రువపత్రాలను సమర్పించిన దరఖాస్తుదారులకు 72 గంటల్లో అనుమతులు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడిస్తూ..

..వాయిస్...30 సెకన్లు

---------------------------

తిరుపతి నగరంలో ఈరోజు వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ఈ ర్యాలీని ప్రారంభించారు. బాలాజీకాలనీ సర్కిల్ నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించగా.. విద్యార్థులు, మాజీ సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని .. వీర మరణం పొందిన మురళి నాయక్ లాంటి వ్యక్తులను దేశం ఎప్పటికీ గుర్తించుకుంటుందని తెలిపారు.

=====================